క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలి వచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

ఘనంగా బంగారమ్మ మారువారం



సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని గ్రామస్తులు దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మృతి చెందిన చూడి ఆవు

సబ్బవరం: పైడివాడ అగ్రహారం గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో విద్యుదాఘాతానికి గురై చూడి ఆవు మృత్యువాత పడింది.వివరాలు.. గ్రామానికి చెందిన పెచ్చేటి కనకరాజుకు చెందిన చూడి ఆవు ఆలయం సమీపంలో మేతకు వెళ్లింది. అయితే అదే సమయంలో విద్యుత్ ఎల్‌టీ లైన్‌కు చెందిన వైరు తెగిపడి ఆవు కాళ్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. చూడి ఆవు ఖరీదు సుమారు రూ. 60 వేలు ఉంటుందని రైతులు చెబుతున్నారు.విద్యుత్ సంస్థ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

భౌ బోయ్



- వీధి కుక్కల స్వైర విహారం
- బెంబేలెత్తి పోతున్న ప్రజలు



నాయుడుపాలెంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న గ్రామ సింహాలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు ప్రజలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఏ వీధిలో చూసినా వీధి కుక్కలే దర్శనమిస్తున్నాయి. రహదారులపై ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా పరవాడ, తానాం, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, నాయుడుపాలెం, గొర్లివానిపాలెం, పెదముషిడివాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద చాలా అధికంగా ఉంది.



రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

మాంసం, చేపల దుకాణాలను ఆవాసాలు చేసుకొని ఆయా ప్రాంతాల్లో మకాం వేస్తున్నాయి. రోడ్లపై వాహనాలపై రాకపోకలు సాగించే ప్రయాణికుల వెంటపడుతూ తరుముతున్నాయి. వెంటపడుతున్న వీధి కుక్కలను చూసి ప్రయాణికులు భయపడి పరుగులు తీస్తున్నారు. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం మత్స్యకార గ్రామాల్లో గ్రామ సింహాలు బెంబేలెత్తిస్తున్నాయి. తీర ప్రాంతాల సందర్శనకు వచ్చిన వారిని కూడా వెంట తరుముతున్నాయి. మండలంలో ఏ గ్రామం వెళ్లినా వీధి కుక్కలు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. చీకటి పడితే రోడ్ల మీదకు రావడానికి గ్రామీణ ప్రజలు భయపడిపోతున్నారు. రాత్రి సమయంలో వీధుల వెంట పెద్ద పెద్దగా అరుస్తూ పల్లె వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వీధి కుక్కల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని పల్లెవాసులు డిమాండ్ చేస్తున్నారు.

గొల్లలపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా

- రాత్రికి రాత్రే చదును చేసి మొక్కలు నాటిన అక్రమార్కులు
- రెవెన్యూ అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు



గొల్లలపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో విలువైన ప్రభుత్వ భూమిని పొక్లెయిన్‌తో చదును చేసి కబ్జాకు పాల్పడ్డారు. దీనిపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. వైఎస్సార్ అర్బన్ హౌసింగ్ లే అవుట్‌కు ఆనుకొని ఉన్న విలువైన భూమిలో రాత్రికి రాత్రే పొక్లెయిన్‌తో గట్లు పోల్చి మొక్కలు నాటేశారు. అయితే డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ ఆదేశాల మేరకు వీఆర్వో పూడి శేషు ఆక్రమిత భూమిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గొల్లలపాలెం సర్వే నెంబర్ 1/1లో సుమారు 80 నుంచి 90 సెంట్లు వరకూ ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించామన్నారు.సదరు ప్రభుత్వ భూమికి ఆనుకొని అటవీశాఖ భూములు ఉన్నాయన్నారు.అటవీశాఖకు చెందిన భూమి 20 అడుగుల మేర ఆక్రమణకు గురైందన్నారు. ఫారెస్టు అధికారుకు సమాచారం అందడంతో వారు కూడా వచ్చి భూమిని పరిశీలించి వెళ్లారన్నారు.బుధవారం సమగ్ర సర్వే చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

హాజరు సకాలంలో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సువర్ణ

పెందుర్తి: ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల హాజరును సకాలంలో యాప్‌లో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి సువర్ణ సూచించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వేపగుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు,నాణ్యత,పరిశుభ్రతలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆగస్టు 31లోపు ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం నేర్పించాలన్నారు.ప్రతి పాఠశాలలో బేస్ లైన్ టెస్ట్ నిర్వహించి సి,డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం డాక్టర్ రమేష్ ఉపాధ్యాయులకు హెల్త్ కేర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో-2 మధుమూర్తి,జిల్లా మధ్యాహ్న భోజన పథకం కో ఆర్డినేటర్ జేఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

‘స్టాప్ డయేరియా’పై అవగాహన కల్పించాలి



భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: స్టాప్ డయేరియా కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం భీమ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్య సేవల గురించి ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్, గర్భిణులకు అందుతున్న సేవలను తనిఖీ చేసి, గర్భిణులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. ఎనీమియాపై ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యూపీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్యాధికారులకు తెలిపారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పాటించాలని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల జేకేసీ, ఐక్యూఏసీ, రసాయన శాస్త్ర విభాగం, గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా మంగళవారం కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలి? విద్య అనంతరం ఎలా స్థిరపడాలి? అనే అంశాలపై మార్గ నిర్దేశం చేశారు. గ్లోరియస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలోని అభ్యర్థుల కోసం ఒక యాప్ రూపొందించినట్టు చెప్పారు. యాప్ ద్వారా సులభంగా సమాచార సేకరణ వీలవుతుందని, తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని అభ్యర్థులు సేకరించి వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డి. అరుణపద్మ, రసాయనశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. కల్యాణ్‌రామ్, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతోనే వ్యాధుల నివారణ



సిబ్బందితో చర్చిస్తున్న డీఎంవో డాక్టర్ తులసి

మహారాణిపేట: డెంగ్యూ, మలేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) డాక్టర్ తులసి అన్నారు. మంగళవారం కేజీహెచ్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇక్కడ వారం పాడవునా వివిధ బ్లాకుల్లో నిఘా నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొక్క బృందంలో ఏడుగురు సభ్యులు ఉంటారని, మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కేజీహెచ్‌లో దోమల సంచారం ఎక్కువగా ఉండే 9 ప్రాంతాలను గుర్తించామని, నవంబర్ వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. డెంగ్యూ, మలేరియా నివారణకు కేజీహెచ్‌లో జీవీఎంసీ మలేరియా నివారణ విభాగం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో సబ్ యూనిట్ అధికారులు శ్రీనివాసాచార్యులు, శేషుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ మోహన్‌దత్తా, హెల్త్ అసిస్టెంట్ చలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే

అదుపులో నేరాలు



76వ వార్డు స్వతంత్రనగర్‌లో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అక్కిరెడ్డిపాలెం : ప్రజల సహకారంతో నేరాలు అదుపు చేయవచ్చని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. 76వ వార్డు స్వతంత్రనగర్ పప్పుల ఫ్యాక్టరీ వద్ద మంగళవారం రాత్రి స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. అధ్యక్షత వహించిన డీసీపీ-2 మేకా సత్తిబాబు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్‌గా వచ్చిన బాగ్చీ నేరాల అదుపునకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్వతంత్రనగర్ మహిళలు ఈ ప్రాంతంలో జరుగుతున్న నేరాలపై తెలపాలన్నారు. దీనికి స్పందించిన స్థానిక మహిళలు మాట్లాడుతూ తమ ప్రాంతంలో చాలా చోట్ల వీధిలైట్లు లేవని, ఖాళీ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో తుప్పలతో నిండిపోయాయని తెలిపారు.

దొంగలు, నేరగాళ్లు రాత్రిళ్లు నేరాలకు పాల్పడి తుప్పల్లో దాక్కుంటున్నారని వివరించారు. ఎక్కువగా స్క్రాప్ వ్యాపారాలు జరుగుతుంటాయని, సిగరెట్లు, మద్యం బహిరంగ ప్రదేశాల్లోనే సేవిస్తుంటారని తెలిపారు. దీనికి స్పందించిన సీపీ వెంటనే పోలీస్ సిబ్బందిని అలెర్ట్ చేయాలన్నారు. కాలనీలో వీధిలైట్లు పునరుద్ధరించాలని, తుప్పలు కొట్టించి నేరగాళ్లకు కళ్లెం వేయాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 4 బ్యాచ్‌ల పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాను 1వ తేదీన విధుల్లో చేరానని, ఇప్పటి వరకు 4 ప్రాంతాల ప్రజాలతో ముఖాముఖి నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఎక్కడైనా గ్యాంబ్లింగ్, గంజాయి సేవించడం, రవాణా వంటివి జరిగితే ఉక్కుపాదం మోపుతామన్నారు. తమ పిల్లలు తప్పుదారి పట్టకుండా వారిని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. 7995095977 నంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తానన్నారు. సమాచారం ఇచ్చిన వారి నంబర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ వి.శ్రీనివాసరావు, క్రైం సీఐ కె.శ్రీనివాసరావు, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది, సచివాలయ పోలీసులు పాల్గొన్నారు.

విద్యా సౌరభాలు

- బోధనలో దూసుకుపోతున్న విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
- విద్యార్థినులకు అందుబాటులో అనేక కోర్సులు
- ప్రైవేట్‌కు దీటుగా సేవలు
- సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంలో అందుబాటులో 800 సీట్లు



విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల



అధునాతన సైన్స్ ల్యాబ్

డాబాగార్డెన్స్: ఎందరో విద్యార్థినుల ఉపాధికి బాట వేసిన కళాశాల.. విద్యతో పాటు నైపుణ్యం.. క్రీడలు.. సాంస్కృతిక.. సామాజిక రంగాల్లో పిల్లలను తీర్చిదిద్దుతున్న కళాశాల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల. నగర నడిబొడ్డున పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో ఈ చదువుల ప్రాంగణం నిర్వహించబడుతోంది. దేశంలోనే నేక్ ఏ+ గ్రేడ్ సాధించిన తొలి మహిళా డిగ్రీ కళాశాలగా గుర్తింపు పొంది ఇటీవలే స్వయం ప్రతిపత్తి హోదా సాధించింది.

దశాబ్దాలుగా విద్యా సౌరభాలు వెదజల్లుతూ..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 1975 నుంచి విద్యారంగంలో తన వంతు పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దుతూ విశాఖ జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ మహిళా కళాశాలగా గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో గుణాత్మకమైన విద్యనందిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యాబోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ విద్యనందిస్తోంది.

అన్ని రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ..

విశాలమైన తరగతి గదులు, ఉన్నత ప్రమాణాలు కలిగిన బోధనా సిబ్బంది, ప్రయోగశాలలు కలిగి ఉంది. విద్యార్థులకు డిజిటల్, వర్చువల్ తరగతులు.. మూక్స్ వంటి ఆన్‌లైన్ కోర్సులు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారు. విద్యార్థినులకు పోటీ పరీక్షల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆసెట్ పరీక్షల్లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రతి ఏడాది కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్(జేకేసీ) ద్వారా నిర్వహించే క్యాంపస్ డ్రైవ్‌లు, జాబ్ మేళాల్లో కళాశాల విద్యార్థినులు ఉపాధి పొందుతున్నారు. జాతీయ స్థాయిలో సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యార్థినులను సాంకేతిక విజ్ఞానాభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు హెచ్‌పీసీఎల్ మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తోంది. కేవలం చదువులకే కాకుండా, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఆటలు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కల్పిస్తున్నారు. కరాటేలో శిక్షణ, సాహిత్యం, నాట్యం, కవిత్వం వంటి వాటిలో కూడా ప్రోత్సహిస్తున్నారు.

ప్రవేశాలకు వేళాయె..

మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులకు సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంలో బీఏ, బీ.కాం, బీఎస్సీ గ్రూపులకు సంబంధించి 800 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ నెల 10వ తేదీలోగా తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి, 11 నుంచి 15 వరకు వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకోవడానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించింది.

కోర్సులు ఇలా.. :

బీఏ హిస్టరీ, బీఏ ఎకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం డిజిటల్ మార్కెటింగ్, బీకాం హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బీకాం రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ మైక్రో బయాలజీ, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బయోటెక్నాలజీ కోర్సులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.



లైబ్రరీలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న విద్యార్థినులు

ప్రైవేట్..కార్పొరేట్‌కు దీటుగా..



ప్రైవేట్.. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన విద్యాబోధన, ప్రభుత్వం నిర్ణయించిన నామమాత్రపు ఫీజుల సదుపాయం, అత్యాధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, ఇంగ్లీషు ల్యాబ్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, సువిశాలమైన రీడింగ్ హాల్, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, మ్యాగజైన్స్ చదువుకునే అవకాశం కల్పించాం.

–డాక్టర్ మంజుల, ప్రిన్సిపాల్, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటుపై ఫిర్యాదు

అగనంపూడి: కూర్మన్నపాలెం జాతీయ రహదారి బస్‌బేను ఆనుకొని జాతీయ నాయకుల విగ్రహాల ఏర్పాటు పేరుతో దుకాణాలు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉక్కు కో-ఆపరేటివ్ స్టోర్స్ మాజీ డైరెక్టర్ కాసా పద్మరాజు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. విశాఖ ఉక్కు కార్మిక సంఘం నాయకుడిగా చలామణీ అయిన వ్యక్తి గతంలో జాతీయ నాయకుల విగ్రహాలను రహదారిపై ఏర్పాటు చేశారని, అయితే వాటిని ఆనుకొని ప్రస్తుతం పక్కా కట్టడాలు చేపతుండడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు బస్టాప్‌ను ఆనుకొని చేపడుతున్న పక్కా కట్టడాలు తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

వరాహావతారంలో జగన్నాథస్వామి



వరాహావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడిలో కొలువైన జగన్నాథస్వామి మంగళవారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అగనంపూడి పరిసర కాలనీల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథ స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బొౖద్రమాంబ సేవా సమితి, మరిడిమాంబ పారాయణ సమితి ఆధ్వర్యంలో విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గళ్ల సాయికుమార్, మామిడి నాగేశ్వరరావు, నాగమణి, కుసుమంచి కుమారి, వరదారాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలే ‘ఉక్కు’ దుస్థితికి కారణం

అగనంపూడి: పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన విధానాలు, ఉక్కు కర్మాగారానికి సహాయ నిరాకరణ వల్ల ఉక్కు పరిశ్రమకు ఈ దుస్థితి ఎదురైందని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 1244వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు నష్టాల్లో ఉందని కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ప్రకటించడం అన్యాయమన్నారు. అది అవాస్తవమన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తామని ప్రకటించే వరకు ఉక్కు పరిస్థితి ఆశాజనకంగా ఉండేదని తెలిపారు. అలాంటి ఉక్కు ఊపిరి తీసి, వారి అనుయాయులకు అప్పగించాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ కుట్రలో కేంద్ర సహాయ మంత్రి కూడా భాగస్వాములు కావొద్దని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.